క్లుప్తంగా

పక్కాగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే



పెద్దూరులో నిర్వహించిన సర్వేని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: గ్రామసచివాలయ వ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులకు అనుగుణంగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేను పక్కాగా నిర్వహించడం జరుగుతుందని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దూరు, బీపీపురం గ్రామసచివాలయ సిబ్బంది నిర్వహించిన సర్వేని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేవలపై లబ్ధిదారులను ఆరా తీయనున్నట్లు చెప్పారు. ఎన్‌పీసీఐలో లబ్ధిదారుడు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా అనుసంధానం, విద్యుత్ బిల్లులు పరిమితికి మించి ఉండటం తదితర సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు పొందడంలో అడ్డంకులను ఈసర్వేలో వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, పంచాయతీ కార్యదర్శి సుభద్రమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సర్వే



ఉల్లిబద్రలో డ్రోన్ సర్వే చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే సమగ్ర భూసర్వేని ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉల్లిబద్ర రెవెన్యూ పరిధిలో సోమవారం డ్రోన్ సర్వే నిర్వహించారు. రైతుల సమక్షంలో భూముల సరిహద్దులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు సర్వే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భూ సర్వేతో రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

3న మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక

జియ్యమ్మవలస: మండల ఉపాధ్యక్ష ఎన్నిక ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. మండల పరిషత్ 1వ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన గెడ్డతిరువాడ ఎంపీటీసీ ముదిలి షణ్ముఖరావు ఇటీవల మరణించారు. ఆయన స్థానంలో సభ్యులు మరో ఉపాధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

మరో 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



ధాన్యం నిల్వలను జియోట్యాగింగ్ చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

భామిని: మండల పరిధిలోని రైతుల నుంచి మరో 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారుల నుంచి అనుమతులు వచ్చాయని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రైతుల నుంచి ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, మండల కోఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్‌తో పాటు పలువురు రైతులు జిల్లా అధికారులను కలిసి మిగులు ధాన్యం కొనుగోలు చేయాలని వినతిపత్రం అందజేయడంతో ఉన్నతాధికారులు ఆ మేరకు అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. అధికారులు సోమవారం పలు గ్రామాల్లోని రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం నిలువలను పరిశీలించారు. బత్తిలి, కాట్రగడ-బి, వడ్డంగి, లోహరిజోల, బురుజోల, భామిని, చిన్నదిమిలి, పెద్దదిమిలి, బాలేరు, సొలికిరి గ్రామాల్లో ధాన్యం నిల్వలను గుర్తించి ఆర్‌బీకే సిబ్బందితో ధాన్యం నిల్వలకు జియోట్యాగింగ్ చేయించారు.

గురుకులం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

భామిని: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు సోమవారం సందర్శించారు. 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యాప్రమాణాలను పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకుంటున్న చర్యలను ప్రిన్సిపాల్ కె.విజయనిర్మల, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

జాతికి మార్గదర్శకుడు బాపూజీ

- సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్
- మహాత్ముడికి ఘన నివాళి



పాలకొండ రూరల్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్, సిబ్బంది

పాలకొండ రూరల్: సత్యం, అహింస మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టిన మహాత్ముడు గాంధీజీ అని, ఆయన జీవితం జాతికి మార్గదర్శకమని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం తన కార్యాలయం ప్రాంగణంలో ఉన్న మహాత్ముని విగ్రహానికి సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి తరం ఆయన చూపిన శాంతి మార్గాన్ని అనుసరించాలని, దేశానికి సేవచేయాలని సూచించారు.

మహాత్ముని ఆశయ సాధనకు కృషి

కురుపాం: జాతి పిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్య్ర సాధనకు ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు కొనసాగాలి

పాలకొండ: మహాత్మా గాంధీ ఆశయాలు కొనసాగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దనరావు అన్నారు. కళాశాల ఆవరణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

సీతంపేట: గాంధీ మహాత్ముడు సూచించిన మార్గం అనుసరణీయమని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి అన్నారు. పాఠశాలలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సాధనలో ఆయన అనుసరించిన మార్గాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి

గరుగుబిల్లి: తోటపల్లిలోని ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి జట్టు ట్రస్టీ డి.పారినాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ మహాత్ముని స్ఫూర్తితో ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. గాంధీ జీవిత చరిత్ర నుంచి నిజాయితీ, ఆత్మస్థైర్యం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.నూకంనాయుడు, జి.మురళీ తదితరులున్నారు. అలాగే స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వాహకుడు ఎస్.మధుసూదనారావు విద్యార్థులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.



కురుపాం: గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది



పాలకొండ: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు



సీతంపేట: గాంధీజీకి నివాళి అర్పిస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి, సిబ్బంది



గరుగుబిల్లి: తోటపల్లి ఆదిదేవోభవ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జట్టు ట్రస్టీ పారినాయుడు, తదితరులు



గరుగుబిల్లి: శాఖాగ్రంథాలయంలో విద్యార్థులతో కలిసి గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు మధుసూదనరావు

మెరుగైన బోధన అందించాలి

- సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



విద్యార్థుల ప్రమాణాలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఉపాధ్యాయులకు సూచించారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. విద్యార్థుల సంఖ్య, హాజరును పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి విద్యాప్రమాణాలను పరిశీలించారు. ఎంఈఓ మీసాల సూర్యనారాయణతో మాట్లాడి విద్యార్థుల ఉత్తీర్ణతకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల వివరాలు, బోధనకు అవసరమైన అంశాలపై చర్చించారు. పాఠశాల గ్రంథాలయం, మినరల్ వాటర్ ప్లాంట్, తరగతి తగదుల నిర్వహణను పరిశీలించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: రైతుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ నిర్వంచిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలుకు ఉన్న అడ్డంకులను తొలగించాలని కోరారు. ఆయనతో పాటు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్పందనకు గైర్హాజరైతే చర్యలు

- ఐటీడీఏ పీఓ బి.నవ్య



వినతులు స్వీకరిస్తున్న పీవో నవ్య

సీతంపేట: గిరిజన స్పందనకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తప్పవని ఐటీడీఏ పీఓ బి.నవ్య హెచ్చరించారు. ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జగతిపల్లి, బెన్నడుగూడ గ్రామాలకు సీసీరోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు స్పందనలో కోరారు. పీహెచ్ రోడ్డు నుంచి పెదరామకు బీటీ రోడ్డు నిర్మించాలని సర్పంచ్ తిరుపతిరావు, చెరువులో పూడికలు తొలగించాలని కుసుమూరుకు చెందిన ఆనందరావు, టార్పాలిన్లు మంజూరు చేయాలని వలగజ్జిగూడకు చెందిన ఎస్.తవిటమ్మ వినతులు అందజేశారు. జీపీఎస్ పాఠశాల మరమ్మతులు చేయించాలని చింతల పోలూరుకు చెందిన గిరిజనులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మురళి, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, జీసీసీ డీఎం సంధ్యారాణి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేయించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు, తదితరులు

భామిని: సహకార సొసైటీ పరిధిలోని రైతులు తీసుకున్న పంట రుణాలను తిరిగి రెన్యూవల్ చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన పావలా వడ్డీ రాయితీ పొందాలని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ కోరారు. భామిని సొసైటీ కార్యాలయంలో సోమవారం డైరెక్టర్లతో సమావేశమై మాట్లాడారు. ఫిబ్రవరి 28లోగా పంట రుణాలు విధిగా రెన్యూవల్ చేయాలని సూచించారు. ప్రతీ రైతు ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ పొందేలా చూడాలన్నారు. రైతులు క్రాప్‌లోన్స్ రెన్యూవల్స్ కోసం 1బి అడంగల్, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో సొసైటీ కార్యాలయానికి వచ్చి రెన్యూవల్ చేయించుకోవాలని సీఈఓ బొడ్డేపల్లి సన్యాసిరావు సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ కె.చంద్రశేఖర్, డైరెక్టర్లు కాగితాపల్లి కృష్ణారావు, బిడ్డిక వీరన్న, పార్టీ నాయకులు మేడిబోయిన చలపతి రావు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు సాగు సలహాలు అందించాలి

కురుపాం: మండలంలోని రస్తాకుంటుబాయిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గిరిజన రైతులకు మెరుగైన వ్యవసాయ సేవలు అందించాలని గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంవత్సరాలుగా ఏజన్సీలో సేవలు అందిస్తున్నట్లు చెప్పుకుంటున్న కేవీకే శాస్త్రవేత్తలు గిరిజన రైతులు పండిస్తున్న జీడిమామిడి, కంది, పసుపు, రాగులు, జొన్నలు గత రెండేళ్లుగా తెగుళ్ల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. వ్యవసాయ పనిముట్లు కూడా సక్రమంగా పంపిణీ చేయటం లేదని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

పౌర హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న డీటీ నిమ్మల శేఖరం

భామిని: మండలంలోని కాట్రగడ-బిలో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం అధ్యక్షతన పౌర హక్కుల దివాన్ని(సివిల్ రైట్స్ డే) సోమవారం నిర్వహించారు. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను అధికారులు వివరించారు. ఇతరుల హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఆర్‌ఐ ఎస్.రాంబాబు, రెవెన్యూ జేఏ జి.చందు, సచివాలయ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం



బొమ్మికలో రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ సత్యంనాయుడు

జియ్యమ్మవలస: ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకున్న రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని వెలుగు ఏపీడీ సత్యంనాయుడు అన్నారు. మండలంలోని అలమండ, బీజేపురం రైతుభరోసా కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలు, ఈ-క్రాప్‌లో నమోదైన పంటల వివరాలను ఆర్‌బీకే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 20 మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. రైతుల నుంచి పూర్తి వివరాలు సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం వెంకట్, సిబ్బంది ఉన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నగరపంచాయతీ వాహనాలకు బీమా చేయకపోవడంతో ప్రమాదం జరిగితే సమస్యలు వస్తున్నాయని సభ్యుడు వెలమల మన్మథరావు తెలిపారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. పనుల కేటాయింపును వార్డుల వారిగా సమానంగా పంపిణీ చేయాలని సభ్యులు కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు చేసి ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎంపీపీ దమలపాటి, గ్రామస్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత కాశీసుందర విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఎస్.వెంకటరమణశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవతామూర్తుల విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు ఘటాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాల మధ్య ఉత్సవమూర్తుల తిరువీధి ఘనంగా జరిగింది. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తం



రావివలసలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

గరుగుబిల్లి: కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రావివలస జంక్షన్ వద్ద, పెద్దూరులో మానవహారం ఏర్పాటు చేశారు. కుష్ఠ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై వైద్యులు పీఏ ప్రియాంక, కె.అరుణకుమారి అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి మందులు వాడినట్లయితే ఆరు నెలలో వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది సిబ్బంది, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, ఈఓ ప్రకాష్, జోజి, ఎం.నర్సింగరావు, జి.సురేష్‌కుమార్ తదితరులున్నారు.

పోటెత్తిన మరియగిరి



ప్రార్థనలు చేస్తున్న మఠ కన్యలు



కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న భక్తులు



మరియగిరి యాత్రకు సోమవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. కొండపై ఉన్న మేరీమాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న కరుణగిరిపై ఉన్న శిలువను దర్శించుకుని పూజలు చేశారు. కొండపైవు వచ్చే రహదారులన్నీ భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మరియగిరి ఉత్సవం సందర్భంగా వీరఘట్టం ఆర్‌సీఎం చర్చి నుంచి మేరీమాత ఉత్సవ విగ్రహాన్ని ఊరిగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – వీరఘట్టం

రెండు పూటలా పనులు చేయాలి



కొమరాడ: ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ బాలకృష్ణ

కొమరాడ: ఉపాధిహామీ పథకం పనులకు వస్తున్న వేతనదారులు సమయపాలన పాటించాలని, రెండు పూటలా పనులు చేయాలని ఏపీఓ బాలకృష్ణ సూచించారు. మండలంలోని గుణానపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. నిర్దేశిత కొలతల మేరకు పనులు పూర్తిచేస్తే రోజుకు గరిష్ఠంగా రూ.257 వేతనం పొందవచ్చన్నారు. పని ప్రదేశం వద్ద తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, పారదర్శకంగా మస్తర్లు నమోదు చేయాలని క్షేత్రసహాయకులకు సూచించారు. జంఝావతి మేజర్ ఛానల్‌లో సుమారు 8 కిలోమీటర్ల మేర ఉపాధి పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించినట్లు చెప్పారు. రాజ్యలక్ష్మీపురం నుంచి విక్రంపురం వరకు ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. పనులకు హాజరు కానివారి పేర్లు మస్తర్లలో నింపితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి పనులకు వచ్చిన వారి ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు.